క్లుప్తంగా

రోడ్డు భద్రతపై ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : రహదారి భద్రతా నిబంధనలపై జాతీయ సంస్కృత వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం వారు ర్యాలీ నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్లాపాటి దామోదర్‌నాయుడు, డీన్‌లు సత్యనారాయణాచార్య, రజనీకాంత్‌శుక్లా, రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, డాక్టర్ కనపాల కుమార్, మేరీ సుజాత పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఖాదర్‌బాషాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల : మండలంలోని తురకపల్లె ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఖాదర్‌బాషా ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబ్జీ, ఉపాధ్యాయులు జార్జి, యువరాజు, చెంగల్రాయులు, అన్సర్‌బాషా, కేశవరావు, సునీకర్, సాబీరాబేగం, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మత్తుతో భవిత చిత్తు

చంద్రగిరి : విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారితే భవిష్యత్తు నాశనమవుతుందని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం ఏ.రంగంపేట సమీపంలోని పీజీ హాస్టళ్ల వద్ద విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ గంజాయికి విక్రయాలపై డయల్ 100 లేదా 8099999977 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పలు హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు.

ఉద్యోగుల జీవితాలతో చెలగాటం



మాట్లాడుతున్న వాసు యాదవ్

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఉద్యోగుల జీవితాలతో కూటమి నేతలు చెలగాటమాడుతున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ వంశీ, అధికార ప్రతినిధి వాసు యాదవ్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. భక్తులకు సేవలందిస్తున్న టీటీడీ ఉద్యోగులపై పాలక మండలి సభ్యుల పెత్తనం పెరిగిపోయిందన్నారు. ఉద్యోగిని బోర్డు సభ్యుడు నరేష్ అసభ్య పదజాలంతో శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద దూషించడం దారుణమని మండిపడ్డారు. గతంలో టీటీడీ ఉద్యోగులను గౌరవించడంతో పాటు వారి కలను నెరవేర్చిన ఘనత టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికే దక్కుతుందన్నారు. తిరుమలలో నిత్యం గోవిందనామ స్మరణ మాత్రమే వినిపించాలని సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోర్డు సభ్యుడు నరేష్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు పసుపులేటి సురేష్, అనిల్‌రెడ్డి, కిరణ్, బాబ్జీ పాల్గొన్నారు.

అశోక్ లేలాండ్ 'సాతి' ఆవిష్కరణ



వెహికల్‌ను కస్టమర్‌కు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులోని ఆర్కేడ్ ఆటో షోరూమ్‌లో శుక్రవారం అశోక్ లేలాండ్ సరికొత్త సాతి వెహికల్‌నుకంపెనీ లైట్ కమర్షియల్ వెహికల్ హెడ్ విప్లవ్‌షా ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ఆర్కేడ్ ఆటో షోరూమ్ ద్వారా ఆధునిక వెహికల్స్‌ను వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. నూతన సాతికి వెహికల్ అత్యుత్తమ మైలేజ్‌తో పాటు ఉత్తమ పనితీరుతో సౌకర్యవంతంగా రూపొందించినట్లు వెల్లడించారు. 45 హెచ్‌పీ ఇంజన్‌తో సాతి వెహికల్ అతి పెద్ద లోడింగ్, సామర్థ్యాన్ని అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సంజయ్‌బోస్, శ్రీకాంత్ పడాల, పాండియన్, రాకేష్ షరీఫ్, ప్రవీణ్‌కుమార కె.రంజిత్, షోరూమ్ ఎండీ బాలాజీ చౌదరి, డైరెక్టర్లు తేజ్, వెంకటరమణ పాల్గొన్నారు.

'సేంద్రియ'ంతో ఆరోగ్య సమాజం

తిరుపతి కల్చరల్ : సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలతోనే ఆరోగ్యకర సమాజం తయారవుతుందని ఏడీఏ(పీసీ) ధనంజయరెడ్డి తెలిపారు. శుక్రవారం రాస్ భవన్‌లో చెన్నైకి చెందిన మద్రాస్ ఫెర్టిలైజర్స్ సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదినారాయణ స్వామి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, డీపీఎం సేంద్రీయ వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అడిషినల్ మేనేజర్లు రమేష్, రాము పాల్గొన్నారు.


మార్చి 31 వరకు 'దీపం' గడువు

తిరుపతి అర్బన్: దీపం–2 పథకం తొలి ఉచిత సిలిండర్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31 వరకు గడువు ఉందని జేసీ శుభం బన్సల్ తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో కస్టమర్ల నుంచి అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై ఫిర్యాదు వస్తే ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు.

మహిమాన్వితం.. యోగుల పర్వతం

సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు సంచరించిన మహిమాన్విత ప్రదేశం.. వైకుంఠనాథుడు పుణ్యస్నానమాచరించిన పవిత్ర స్థలం.. సిద్ధపురుషులు కఠోర తపస్సు చేసిన పునీత ప్రాంతం.. దివి నుంచి భువికి దిగి వచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి నిత్య పూజలందించేందుకు తరలివచ్చిన మహర్షుల ఆవాసం.. ఇహ పర సుఖాలను పరిత్యజించిన మహనీయులు కొలువుదీరిన ఆధ్యాత్మిక క్షేత్రం.. యోగుల పర్వతంగా విరాజిల్లుతూ భక్తకోటి నీరాజనాలందుకుంది. విశిష్ట నామాల కాలువకు నెలవై జనులకు ఆయురారోగ్యాలు ప్రసాదించింది. శ్రీనివాసుని పాదస్పర్శతో పులకించిన మహత్తర మలయంపై ప్రత్యేక కథనం.

- సిద్ధపురుషులు నివసించిన పుణ్యస్థలం
- తాజాగా బయటపడిన శ్రీవారి పాదముద్రలు
- గత వైభవానికి గుర్తుగా నామాల కాలువ
- టీటీడీ ఆధ్వర్యంలో ఆలయం నిర్మించాలంటున్న స్థానికులు



యోగుల పర్వతం (ఇన్‌సెట్) శ్రీవారి పాద ముద్రలు



నామాల కాలువ గట్టున శ్రీవేంకటేశ్వరస్వామివారి విగ్రహం

రామచంద్రాపురం : చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం కమ్మపల్లె–అప్పలాయిగుంట మార్గంలో యోగుల పర్వతం ఉంది. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామివారు తరలివచ్చి అక్కడి సిద్ధ పురుషులు, ఋషులను కటాక్షించారని భక్తుల నమ్మకం. దాదాపు తొమ్మిది రోజుల పాటు ఆ పర్వతంపై శ్రీవారు బస చేసినట్టుగా పురాణాల్లో పేర్కొనబడింది. ఆ సమయంలో పర్వతానికి సమీపంలోని కాలువలో మానవ రూపం ధరించిన శ్రీమన్నారాయణుడు స్నానం ఆచరించి నామాలు ధరించే వారు. అందుకే ఆ కాలువకు నామాల కాలువగా నామకరణం చేశారని పెద్దలు చెబుతుంటారు. సాక్షాత్తు శ్రీవారు స్నానం ఆచరించిన కాలువ నుంచి ఇటీవలే శ్రీవారి పాదాలు బయటపడటం ఇందుకు సాక్ష్యంగా స్థానికులు వెల్లడిస్తున్నారు. అంతకు కొద్ది రోజుల క్రితం శ్రీవారి విగ్రహంలో పాదాలకు పైభాగం నడవలూరు గ్రామస్తులకు లభించడం గమనార్హం. తాజాగా శ్రీవారి పాదాలు దొరకడంతో ఆ కాలువ గట్టున వైకుంఠనాథుని ఆలయం నిర్మించి విగ్రహం ప్రతిష్టించాలని స్థానికులు కోరుతున్నారు.

జలం.. పవిత్రం

శ్రీ వేంకటేశ్వరస్వామి స్నానమాచరించిన నామాల కాలువ నీటిని స్థానికులు పవిత్రంగా భావించేవారు. అలాగే ముక్కోటి దేవతలు సైతం ఇందులో పుణ్యస్నానం చేసి శ్రీవారిని దర్శించుకునేవారని పెద్దలు చెప్పుకునేవారని ప్రతీతి. పాత కాలంలో కలరా, మలేరియా, మసూచి, అమ్మతల్లి వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలినప్పుడు ఆ కాలువలో స్నానం చేసేవారు. ఆ నీటిని తీర్థంగా సేవించేవారు. దీంతో చాలా వరకు వ్యాధులు నయమయ్యేవని స్థల పురాణం చెబుతోంది.

నిర్వహణలోపం

కొన్నేళ్లుగా నామాల కాలువను పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా తయారైంది. ఎందరో రోగగ్రస్తులకు సాంత్వన చేకూర్చిన మహత్తర జలం నేడు దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి కాలువ విశిష్టతను చాటేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కాలువను పరిశుభ్రం చేయించి ఆ ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మించాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా మారిన నామాల కాలువ

సిద్ధుల బస



సిద్ధపురుషులు బస చేయడం వల్లే యోగుల పర్వతంగా చరిత్రకెక్కింది. ఈ పర్వతంపై నేటికీ సిద్ధపురుషుల కటాక్షం వుంది. ఇక్కడ శ్రీవేంకటేశ్వరస్వామి వారు కొలువుదీరిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. శ్రీవారి పాద ముద్రలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. పర్వతానికి సమీపంలోని నామాల కాలువలో స్నానం ఆచరించినట్టు పురాణాల్లో చెప్పారు. వైకుంఠనాథుని పాదస్పర్శతో యోగుల పర్వతం పునీతమైంది. అందుకే శ్రీవారి విగ్రహ ప్రతిష్ట జరగాల్సిన అవసరముంది.

– ప్రతాప్ స్వామీజీ, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

పాప హరణం



నామాలకాలువలో బ్రహ్మముహూర్తంలో దేవతలు స్నానం చేస్తుంటారని, ఆ సమయంలో అటుగా ఎవరూ వెళ్లేవారు కాదని మా పెద్దలు చెప్పే వారు. గ్రామస్తులు కూడా తెల్లవారుజామున 4గంటలు దాటిన తర్వాతే ఆ కాలువలో స్నానం చేయాలని నిబంధన కూడా పెట్టారని వెల్లడించేవారు. అవే నియమాలను మా తరంలో కూడా పాటించేవాళ్లం. నామాల కాలువలో మునిగితే సకల పాపాలు పోతాయని భక్తుల నమ్మకం. సర్వ రోగాలు నయమవుతాయని విశ్వాసం.

– వాసుదేవరెడ్డి, నడవలూరు

ఆరోగ్యం బాగుండేది



మా గ్రామంలో ఎవ్వరికి జబ్బు చేసినా తెల్లవారు జామున ఎవరి కంటా పడకుండా నామాల కాలువలో స్నానం చేసి భక్తితో గోవింద నామం జపించేవాళ్లం. దీంతో ఎలాంటి వ్యాధి అయినా తగ్గిపోయేది. మా చిన్నపుడు కూడా నామాల కాలువ నీళ్లు తెచ్చి ఇంట్లోని వారంతా గోవింద నామాలు జపిస్తూ స్నానమాచరించడం చూశాం. ఆ తర్వాత కాలం మారింది.. ఆ కాలువ మరుగునపడింది. స్వామి వారి మహిమతో ఆయన పాదాలు బయటకు రావడంతో కాలువ విశిష్టత వెలుగులోకి వచ్చింది.

– వి.కృష్ణమూర్తి స్వామి, నడవలూరు

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



నాగరాజుతో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : మండలంలోని భారతీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నేత పసల నాగరాజును పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు హర్షిత్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజు ఇంటికి శుక్రవారం వారు వెళ్లి ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం చర్చి వీధికి చెందిన నేత నర్లా నజరత్ ఇంటికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే శ్రీనివాస మంగాపురం చేరుకుని తమ తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్నేహితుడు మహేందర్ రెడ్డి ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులను ఓదార్చారు.


అందరి సహకారంతో 'స్వచ్ఛత'



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలోని ప్రజలు, అధికారులు, సిబ్బంది సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధిస్తామని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా వినతుల పరిష్కారం, పారిశుద్ధ్యం అమలు తదితర అంశాలపై ఆన్‌లైన్‌లో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, పాల్గొన్నారు.

సమైక్యతా శిబిరానికి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : తమిళనాడులోని నాగర్ కోయిల్‌లో శనివారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి ఎస్వీయూ నుంచి ఐదుగురు, మహిళా వర్సిటీ నుంచి ఐదురుగు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థులను వీసీలు అప్పారావు, ఉమ, రిజిస్ట్రార్లు భూపతినాయుడు, రజని అభినందించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్లు డాక్టర్ పాకనాటి హరి కృష్ణ, ప్రొఫెసర్ దామోదరం,, విద్యావతి, ఏపీ కాంటినెంట్ లీడర్ డాక్టర్ యువశ్రీ పాల్గొన్నారు.

మృతదేహం కోసం నిరీక్షణ!

రామచంద్రాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఓ గుడిసెలో ఈనెల 15న నిప్పంటుకుని క్రిష్ణమనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం పోలీసుల సాయంతో 108 ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందాడు. అయితే మెడికో లీగల్ కేసు అయినందున మృత దేహానికి పోస్టు మార్టం చేయకుండా ఇవ్వలేమని అక్కడి వైద్యులు తేల్చిచెప్పారు. దీంతో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌సమాచారం ఇవ్వగా ఎవరూ స్పందించలేదు. దీంతో మార్చురీ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చిందని కుటుంబీకులు వాపోయారు.

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి

తిరుపతి క్రైమ్ : ఓ ప్రైవేట్ హాస్పిటల్ వద్ద తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బీటీఆర్ కాలనీకి చెందిన కోదండపాణి(45), పేరూరుకు చెందిన హేమచంద్రారెడ్డి కారు పార్క్ చేస్తుండగా గొడవ జరిగింది. హేమచంద్రారెడ్డి కత్తితో దాడి చేయడంతో కోదండపాణి గాయపడ్డాడు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం కేసులో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పి.చిన్న బాలయ్యకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు.

సోమస్కందమూర్తి రాజసం



భూత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం రాత్రి కామాక్షి అమ్మవారి సమేతంగా శ్రీసోమస్కందమూర్తి సింహ వాహనంపై ఊరేగారు. అడుగడుగునా భక్తులకు కర్పూర హారతులు సమర్పించారు. ఈ క్రమంలోనే ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి భూత వాహన సేవ కోలాహలంగా సాగింది. అనంతరం ఆలయంలో ఆదిదంపతుల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపన తిరుమంజనం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు తుమ్మలగుంట నుంచి పాదయాత్ర

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం నుంచి చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు శనివారం ఆధ్యాత్మిక మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సమేతంగా పాదయాత్రగా వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహా పాదయాత్రకు చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రీవారి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని చెవిరెడ్డి ఆహ్వానించారు.

గుండెకు ప్రాణం పోయండి

తిరుపతి కల్చరల్: తన బిడ్డ దీప్తి మాధురి(13) గుండె ఆపరేషన్ కోసం దాతలు ఆర్థిసాయం చేయాలని చిన్నారి తండ్రి మనోజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జీవకోనకు చెందిన తాను ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపారు. అయితే తన బిడ్డకు గుండె సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారని, చికిత్సకు రూ.18 లక్షలు ఖర్చవుతుందని వెల్లడించారు. దాతలు 8977765058ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం : సుదర్శన్ ఆటో స్టాండ్ అధ్యక్షుడు ఐఎస్.ఖాజా ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే ఆటో డ్రైవర్ కుమార్తె దీప్తి మాధురి గుండె ఆపరేషన్ కోసం శ్రీవేంకటేశ్వర అంబులెన్స్ సర్వీస్ అసోసియేషన్ నేతలు రూ.35 వేలు ఆర్థిక సాయం అందించారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో 8 మహిళల జట్లు, 16 పురుషుల జట్లు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ చైర్మన్ పడిగల సురేష్ బాబు, డాలర్స్ గ్రూప్ చైర్మన్ దివాకర్ రెడ్డి, ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టు మార్గంలో భక్తుడికి అస్వస్థత

చంద్రగిరి : శ్రీవారిమెట్టు మార్గంలో శుక్రవారం ఓ భక్తుడు అస్వస్థతకు గురయ్యాడు. తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన జైపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు శ్రీవారిమెట్టు గుండా కాలినడకన పయనమయ్యాడు. 1150 మెట్ల వద్ద జైపాల్‌కు మూర్ఛ వచ్చి పడిపోయాడు. సమాచారం అందుకున్న విజిలెన్స్, మెడికల్ సిబ్బంది 108లో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.





విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న అతిథులు, ఎస్‌జీఎస్‌లో.. పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో..





ఎస్పీడబ్ల్యూలో.. , పాకాలలో.. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో..

మాతృభాషామృతం

మాతృభాషతోనే వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుంది. ప్రపంచానికి సంస్కృతి.. సంప్రదాయాల ఉనికి తెలుస్తుంది. మానవ మనుగడకు సార్థకత ఏర్పడుతుంది. వ్యక్తుల నడుమ భావవ్యక్తీకరణ సాధ్యమవుతుంది అని పలువురు వక్తలు వెల్లడించారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు.

– తిరుపతి సిటీ/తిరుపతి కల్చరల్/ తిరుపతి ఎడ్యుకేషన్/ పాకాల

రామకోటేశ్వరరావుకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్ పరిశోధక విద్యార్థి, టీటీడీ డిప్యూటీ కార్యనిర్వహణ ఇంజినీర్ సి.రామకోటేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ పి.వెంకటరామయ్య పర్యవేక్షణలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ అల్యూమినియం మెటల్ మ్యాట్రిక్స్ హైబ్రిడ్ కాంపోజిట్స్ అండ్ ఇట్స్ మెషినింగ్ రెస్పాన్స్ ఇన్ సీఎన్‌సీ డ్రిల్లింగ్ అనే అంశంపై ఆయన పరిశోధన పత్రాలు సమర్పించారు.

శ్రమతోనే లక్ష్యాల సాధన



మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : విద్యార్థులు చిత్తశుద్ధితో శ్రమిస్తేనే లక్ష్యాలను సాధించడం సాధ్యమని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. శుక్రవారం జూపార్క్ రోడ్డులోని మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ అప్పారావుకు పాఠశాల ప్రిన్సిపల్ కె.రేష్మ స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కష్టం విలువ తెలిపిన 'శ్రమకావ్యం'



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

తిరుపతి కల్చరల్ : కష్ట విలువ తెలిపిన అద్భుత సృజన శ్రమకావ్యమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. శుక్రవారం వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ శ్రమ కావ్య గానం చేశారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అశోక్ తేజ మాట్లాడుతూ 2016లో శ్రమకావ్యం రాశానని, దానికి బీజం అంతకు పది ఏళ్లకు ముందే పుట్టిందన్నారు. టెంకాయల దామోదరం, సుద్దాల అశోక్ తేజ సతీమణి నిర్మల పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

తిరుపతి సిటీ : విద్యార్థినులకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇస్తున్నామని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. శుక్రవారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంబ్రాయిడరీ శిక్షణలో వర్క్‌షాప్ నిర్వహించారు. హోమ్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మి, కె.ఉమారాణి, భువనేశ్వరి, శుభానందీశ, శ్రీవాణి, టి.దేవి, కె.హబీబుల్లా పాల్గొన్నారు

మేకపాటి గౌతమ్‌రెడ్డికి నివాళి



గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న భూమన

తిరుపతి మంగళం : మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి 3వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నెల్లూరులో ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి గౌతమ్‌రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, నాయకుడు నల్లాని బాబు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

తిరుపతి రూరల్ : మండలంలోని సి.మల్లవరం పంచాయతీ సాయి లక్ష్మీ లేఅవుట్‌కు చెందిన సుమతి అనే మహిళ మెడలోని బంగారం మంగళసూత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం సాయంత్రం లాక్కెళ్లారు. వివరాలు.. బాధితురాలు తన కుమార్తె ఇందుశ్రీతో కలసి ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా తెల్లరంగు స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండగులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. మొత్తం 26 గ్రాముల బంగారం చోరీకి గురైనటు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ చిన్నగోవిందు వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి రోడ్డు మార్గాల్లో తనిఖీలు చేపట్టారు.